# ముసుగు

ఆఫీసునుండి వస్తూవస్తూ రైతుబజార్లో నాలుగు రకాల కాయగూరలుకొన్నది వైష్ణవి.

బస్టాండు వైపు అడుగులేస్తూ అనుకోకుండా ఐస్‌క్రీం పార్లర్ వైపు చూసింది.

తన కళ్లని విశ్వసించలేక మళ్ళీ మళ్ళీ చూసింది.

సందేహం లేదు అరుణే. ఆమె, ఓ యువకుడూ నవ్వుతూ తుళ్ళుతూ పార్లర్‌లోంచొచ్చారు. అతడు బైక్ స్టార్ట్ చెయ్యగానే చొరవగా వెనకాల కూర్చుంది అరుణ. తాకుతూ కూర్చుని అతడి భుజాలమీద చేతులేసి ఏదో చెబుతోంది!

నిస్త్రాణ అయింది వైష్ణవి. ఎంతో విజ్ఞతా వివేకమూగల అరుణ పరాయి మగాడితో అంతక్లోజ్‌గా వుందంటే ఏమనుకోవాలి? దారితప్పుతోందా? లేక ఆల్రెడీ తప్పిందా?

ముచ్చెమటలు ధారలు కట్టాయి. ఒక్క అడుగు వెయ్యగల శక్తికూడా లేనట్టు అయిపోయింది. ఆటోని పిలిచి ఎక్కింది. ఇంట్లో అడుగు పెడుతూనే మంచినీళ్ళు తాగేంత ఓపిక కూడా లేక సోఫాలో కూలబడింది వైష్ణవి.

తనూ మూర్తీ అరుణ భవిష్యత్తుని ఇంద్ర ధనుస్సులా ఊహించుకొంటోంటే, పంచరంగుల కలలు కంటోంటే తనేమిటిలా ప్రవర్తిస్తోంది? ఎందుకిలా చేస్తోంది?

అరుణకేమయిందసలు?

అసలే వేడి వయస్సు. రెచ్చగొడుతున్న పరిసరాలు. ఆజ్యం పోస్తున్న టీ.వీ.లూ. సినిమాలూ. జరగకూడనిదేదైనా జరిగితే?

మరి భరించలేక విసవిసా అరుణ రూంలో కెళ్ళింది. పుస్తకాలూ, కంప్యూటరూ, సీడీలూ అన్నీ... అన్నీ వెదికింది.

స్పోకెన్ ఇంగ్లీషు సీడీలూ కంప్యూటర్ సీడీలూ, మ్యూజిక్ సీడీలూ క్యాసెట్లూ, రెండు సినిమాలూ నాలుగు గేమ్స్ సీడీలూ, మేనేజ్‌మెంట్ బుక్స్ తప్ప తను అనుమానించినవేమీ కనబళ్ళేదు.

గుండెలమీంచి పెద్ద బరువేదో దిగిపోయినట్టు నిట్టూర్చింది. కాఫీ కలుపుకుంటే బావుణ్ననిపించింది. మూర్తి వచ్చాక చూసుకోవచ్చులే అనుకుంది. కాసిని మంచి నీళ్ళు తాగివచ్చి మూర్తికోసం ఎదురు చూస్తూ కూర్చుంది.

రోజూ ఆరున్నరకే వచ్చేసే మూర్తి ఏడవుతోన్నా రాలేదు. విసుక్కుంది.

లేచి అసహనంగా పచార్లు చేసింది. బాల్కనీలో కెళ్ళి చూసింది. నిరాశపడింది.

'ఆ కుర్రాడు జస్ట్‌ఫ్రెండ్ అయ్యుండడు. వాళ్ళ పద్ధతిచూస్తే చాలా క్లోజ్ అయినట్టేవున్నారు. కొంపతీసి అరుణ అతగాడ్ని ప్రేమించట్లేదు కదా?'

వైష్ణవి గుండెలు గుభిల్లుమన్నాయి.

ఈ కాలం పిల్లలకి షోకులూ జీన్సూ జోక్సూ మ్యూజిక్కూ సినిమాలూ షికార్లూ తప్ప ఏమీపట్టవు. అవి తప్ప ప్రపంచమే లేనట్టుంటారు. భవిష్యత్తు గురించి ఒక ప్లానింగూ వుండదు పాడూ వుండదు. జీవితమంటే ఎవరో సంపాదించింది ఎడంచేత్తో ఖర్చు పెట్టడం కాదు కుడిచేత్తో సంపాదించడమని ఎప్పుడు తెలుసుకుంటారో ఏమో!

'మూర్తికివాళ ఏమయ్యింది?' విసుగూ కోపం తన్నుకురాగా అపార్ట్‌మెంటుకి గడియవేసి లిఫ్ట్‌వైపు నడిచింది.అదే లిఫ్ట్‌లో వచ్చాడు మూర్తి.

"హమ్మయ్య వచ్చావా?"

"ఎక్కడికెళ్తున్నావ్?" మూర్తి అడిగాడు.

"నీ కోసమే వస్తున్నాను. నువ్వింకా రాలేదేవిటా అని చూస్తూ. రా చెబుతా..." అంది వైష్ణవి.

భార్య వంక చిత్రంగా చూస్తూ అనుసరించాడు.

"అదోలా వున్నావేం వైష్ణో" అడిగాడతను.

"నాకేం గుండ్రాయిలా బాగానే వున్నాను. మీ ముద్దుల కూతురు ఏం జేస్తోందో తెలుసా?" ఉక్రోషంతో ముక్కుపుటాలదుర్తోంటే అంది.

అతడి నుదురు ముడివడింది.

"జీన్సుకుర్రాడి బైక్ మీద షికార్లు కొడుతోంది"

"ఓస్ అంతేనా!" అన్నట్టు నిట్టూర్చాడు మూర్తి.

"ఇంత షాకింగ్‌న్యూస్ చెప్పినా నిమ్మకి నీరెత్తినట్టున్నావేంటి? నేన్చెప్పింది అర్థమైందా లేదా?"

"అర్థమైందిగాని రిలాక్స్... నువ్వనసరంగా ఆందోళనపడకు. కాఫీ తాగావా?"

తను ఉద్వేగంతో ఊగిపోతోంటే అతడంత కూల్‌గా వుండటం, మాట్లాడటం మింగుడు పడలేదామెకి.

"నేనన్నదేమిటి నువ్వడుగుతున్నదేంటి? దానికీ దీనికీ అసలు ఏమయినా పొంతనవుందా మూర్తీ?" తీవ్రమైన స్వరంతో అడిగింది వైష్ణవి.

"కూల్‌డౌన్ వైష్ణో. ఎంతో నిబ్బరంగా నిగ్రహంతో దేన్నైనా సరే విశ్లేషించి హంసలా పాలూ నీరూ వేరు చేసి ఒప్పించే వైష్ణో... ప్రతి డిబేట్‌లోనూ పైచెయ్యి అన్పించుకునే వైష్ణో ఇంత చిన్న విషయానికంతగా ఆవేశపడటం ఏమీ బాగాలేదు. కాఫీ కలిపి తెస్తానుండు..." కిచెన్లోకెళ్ళాడు మూర్తి.

అతడివంక వెర్రిగా చూసింది. క్షణాల్లో ఆమె ఆవేశం పాలపొంగుమీద నీళ్ళు చిలకరించినట్టు చల్లబడింది. సోఫాలో వెనక్కి జారబడి కూర్చుంది.

కాఫీ తెచ్చాడు మూర్తి. మౌనంగా తాగారిద్దరూ.

"అసలేం జరిగింది" అడిగాడతను.

చటుక్కున తలెత్తి అతడి ముఖంలోకి చూసింది.

మెల్లగా అంతా చెప్పింది. తన అనుమానాలూ భయాలూ కూడా బయటపెట్టింది.

"అరుణని అడిగావా?"

"ఇంకా ఇంటికి రాందే. ఎక్కడ చక్కెర్లు కొడుతోందో ఏమో" నిరసనగా అంది.

"అక్కడే అప్పుడే ఎదుటికెళ్ళి అడిగేయకపోయావా?" అన్నాడు మూర్తి.

"మూర్తీ... అప్పుడా ఐడియా రాలేదు" గొణిగింది.

"ఇప్పుడొచ్చింది కదా. అరుణని అడుగుదాం. తన 'వ్యూ' ఏంటో తెలుసుకుందాం. ఊరికే ఉద్రేకపడితే ప్రయోజనం ఏముంటుంది చెప్పు?"

"చిన్నపిల్ల దానికేం తెలుస్తుంది? మనం దానికెంత బంగారు భవిష్యత్తు ఇవ్వాలనుకుంటున్నామో తెలిసిందైతే అలా ఎలా బిహేవ్ చేస్తుంది?"

"వైష్ణో! అరుణ చిన్నపిల్లకాదు మేజర్. ఆ సంగతి నువ్వు మర్చిపోకు" చెప్పాడు మూర్తి.

"వయస్సొస్తే మంచీచెడూ తెలిసిపోతాయేంటి. ఆ వయస్సుకి ఆకర్షణా వ్యామోహం తప్ప ఆలోచనా ఆచరణా అర్థంకావు..." అందామె.

"ఒకప్పుడు మనమూ అదే వయస్సులో వున్న సంగతి మరచిపోతావేం?"

"మనం వేరు. మన విజ్ఞానం వేరు. మన దృక్పథం వేరు. మన అభ్యుదయభావాలు వేరు. అప్పట్లో మనం ఎన్ని కార్యక్రమాలు ఎలాంటి కార్యక్రమాలు చేబట్టామో నీకు తెలీదూ? వాటిల్లో ఒన్ పర్సంట్ కూడా వీళ్ళకి వంటబట్టలేదు. వీళ్ళకి జీన్సు మోజు క్లబ్‌ల మోజు సినిమాల మోజు డాలర్లమోజు తప్ప ఇంకేం అక్కర్లేదు. ఆ మోజులు తీరితేచాలు జీవితం ఏమైపోయినా ప్రపంచం ఏమైపోయినా వాళ్ళకి పట్టదు" ఉక్రోషపడింది వైష్ణవి.

నవ్వాడు మూర్తి.

ఉడుకుమోత్తనం వచ్చేసింది వైష్ణవికి.

"నవ్వుతావేంటి? నువ్వూ అంతే. స్లోగా రియాక్టవుతావు. ఎక్కడో ట్యూబ్‌లైటువి!"

బిగ్గరగా నవ్వేశాడు. "ఉరుమురిమి మంగలం మీద పడిందన్నమాట!"

"లేకపోతే గంట నుంచి నేను తల్లక్రిందులైపోతూంటే సీరియస్‌గా తీసుకోవేంటి?"

"తీసుకుందాం. అరుణ వచ్చాక సంగతేంటో తెలుసుకున్నాక. అంతదాకా టాపిక్ డైవర్ట్‌చేద్దాం" ఆమె పక్కన కూర్చుంటూ అన్నాడు మూర్తి.

"నాకు పనుంది..." లేచి వెళ్ళిపోయింది వైష్ణవి.

టవల్ తీసుకుని బాత్‌రూమ్‌లో కెళ్ళింది. స్నానం చేస్తూ కూతురితో తనని పోల్చుకోసాగింది. ఆమె ఆలోచనలు వయస్సులో వున్నప్పటి వైష్ణవి దగ్గరి కెళ్ళాయి.

ఉమెన్స్ కాలేజీలో చదువుతూనే అన్ని రకాల సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేది వైష్ణవి. ముఖ్యంగా నవోదయ సాహితీ సాంస్కృతిక సంస్థలో చేరాక ఆమె దృక్పథమే మారిపోయింది.

ఆ సంస్థ వివేకవర్ధనీ కాలేజీలో నిర్వహించే చర్చల్లో పాల్గొనేది. మిగతా సభ్యులతో కలిసి బస్తీల్లో తిరిగేది. వామపక్ష భావాలను ప్రచారం చేసేది. సాంస్కృతిక ప్రోగ్రాముల్లో పాల్గొనేది. స్థానిక సమస్యల్ని కలగలిపిన వీధినాటకాలేసేది. ప్రజల్ని చైతన్యవంతుల్ని చెయ్యడానికి తన పరిధిలో కృషిచేసేది.

అప్పుడే మూర్తితో పరిచయమైంది. అతడూ 'నవోదయ' సభ్యుడే. చక్కని పాటలు రాసేవాడు. గొంతెత్తిపాడేవాడు. చర్చల్లో తనే అతడ్ని డామినేట్ చేస్తూండేది. ఇద్దరి అభిప్రాయలూ ఆవేశాలూ ఒక్కటే. భావాలూ భవిష్యత్ ఆలోచనలూ ఒక్కటే. ఫలితంగా స్నేహం ప్రణయంగా మారింది. వేరు వేరు కులాలైనా సరే ఇంట్లో అంగీకరించకపోయినా

సరే ఒక్కటిగా నిలిచారు. మిత్రుల సమక్షంలో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో దండల పెళ్ళి చేసుకున్నారు. ఆదర్శదంపతులయ్యారు. తొలుత ఆగ్రహించిన పెద్దలే శాంతించి ఆశీర్వదించారు.

తమకి అలాంటి ఘనచరిత్ర వుంది. అలాంటి తమకి పుట్టిన అరుణ చీప్ ఆకర్షణకి లొంగిపోవడం.....అసలా ఊహకే ఒళ్ళు మండిపోతోంది.

అవతల వైష్ణవే కాదు ఇవతల మూర్తి కూడా కూతురి గురించిన ఆలోచనల్లో నిలువునా మునిగిపోయాడు.

పెళ్ళయ్యాక కూడా తనూ వైష్ణో ప్రతి అభ్యుదయ కార్యక్రమంలోనూ పాల్గొనేవారు. ఎమర్జన్సీలో మాత్రం ఇంటికే పరిమితమయ్యారు. తర్వాత సంసారంలో పడిపోయారు. సంపాదనలో నిమగ్నమైపోయారు. అరుణ పుట్టింది. తన కులమే ఆమెదయ్యింది. వైష్ణో అడ్డుచెప్పలేదు. తల్లికులం వేరని వేలెత్తి చూపించుకోవడం అనవసరమనుకుంది. తాము కులానికి విలువివ్వకపోయినా సమాజం ఇస్తోంది గనుక బిడ్డ భవిష్యత్తు దృష్ట్యా రాజీపడిపోక తప్పలేదు.

నిజానికి అరుణకి ఊహ తెలిసేవరకూ వైష్ణో తనని పేరు పెట్టే పిలిచేది. ఇంట్లో కూడా ఫ్రెండ్స్‌లానే వుండేవాళ్ళు. కాని అరుణ కూడా తనని పేరుతో పిలవటం చూసి తన పద్ధతి మార్చుకుంది. ఆమె లేనప్పుడు మళ్ళీ ఫ్రెండ్స్‌లా వుంటారు.

అరుణ పెళ్ళికి వైష్ణో కులం ప్రతిబంధకం అవుతుందేమో చక్కని సంబంధం రాదేమోనని భయపడ్డారు. అనుకోకుండా అమెరికాలో వుంటోన్న చెల్లెలు తమ కొడుక్కి అరుణని చేసుకోవడానికి ఇష్టపడుతున్నట్టు చెప్పింది. పెద్ద సమస్య దూదిపింజల్లా తేలిపోయినందుకు సంతోషపడుతోంటే ఇప్పుడీ పిడుగులాంటి వార్త వినాల్సొచ్చింది. చూస్తోంటే అరుణ ఎవర్తోనో ప్రేమలో పడినట్టే వుంది.

అతడెవరో ఏమిటో అతడి చదువేమిటో అంతస్తేమిటో మరి!

పెదవి కొరుక్కున్నాడు మూర్తి.

ఫోన్ మ్రోగింది. లైన్లో మిత్రుడు.

“గుడ్‌న్యూస్‌రా. మా ఆసుపత్రి ప్రారంభించడానికి స్వామీజీ అంగీకరించారు”

“గుడ్. మీరంతా ఆయన శిష్యులు కదా. అందుకనే ఒప్పుకునుంటారు” అన్నాడు మూర్తి.

“అదేం కాదురా. పాతికవేలు చందా తీసుకున్నారు” మెల్లగా చెప్పాడతను.

“వ్వాట్.. ఓపెనింగుకి సినీతారలు డబ్బో, గిఫ్టులో తీసుకుంటారని విన్నాను గాని స్వామీజీలు కూడా.....!”

"అదే అడిగాను. స్వామీజీని మీ బిజినెస్ కోసం ఉపయోగించుకుంటున్నప్పుడు ఇందులో తప్పే ముంది? ఆశ్రమానికీ బోలెడు ఖర్చులుంటాయికదా అన్నాడాయన శిష్యుడు" చెప్పాడతను.

"అందుకేరా నేనెప్పుడూ చెబుతుంటాను. వీళ్ళంతా పబ్లిసిటీ మాంగర్స్. చెప్పేవన్నీ శ్రీరంగనీతులు!" అన్నాడు మూర్తి.

"అలాగే అనిపిస్తోంది. ఇంకా చాలా పనులున్నాయిరా. రేపు నువ్వు హెల్ప్ రావాలి. కనీసం మనవాళ్ళైనా తలో చెయ్యి వేస్తే ఫంక్షన్ సక్సెస్ అవుతుంది"

"డోంట్ వర్రీ. రేపు శలవు పెట్టి నీకు హెల్ప్ చేస్తాను" ఫోన్ పెట్టేస్తోంటే వైష్ణవి వచ్చి కూర్చుంది.

ఫోన్లో ఎవరూ అని అడుగుతుందేమోనని సమాధానం చెప్పబోయాడుగాని ఆమె పట్టించుకోలేదు.

"ఎనిమిదవుతున్నా మీ గారాల కూతురింకా రాలేదు చూడండి" అంది వైష్ణవి.

"మనం అతిగా ఊహించుకుంటున్నామేమో అన్పిస్తోంది" అన్నాడు మూర్తి.

"అది ఆడపిల్లండీ. ఎటు తిరిగి ఎటొచ్చినా నష్టపోయేది ఆడదే కదా! మీకేం మగమహారాజులు. అగ్నిలోకి దూకమంటారు అడవిలోకీ పొమ్మంటారు" కోపంగా చూస్తూ అంది వైష్ణవి.

"ఓకే కూల్డౌన్... పిల్లల్లో తిరుగుబాటు మనస్తత్వం వుంటుంది. జాగ్రత్తగా హేండిల్ చెయ్యకపోతే ఎంతకైనా తెగిస్తారు" అన్నాడు మూర్తి.

"నిజమే సుమండీ... అయితే ఇప్పుడేంచేద్దామంటారు" బేల అయిపోయింది వైష్ణవి.

"మనిద్దరం నిగ్రహంతో వ్యవహరిద్దాం. వ్యవహారాన్ని సానుకూలంచేద్దాం" మూర్తి మాటలు పూర్తి కాకుండానే కాలింగ్ బెల్ మోగింది.

"అరుణే అయ్యుంటుంది. నువ్వు మాత్రం తొందరపడకు వైష్ణో..." అన్నాడు మూర్తి.

తలూపి వెళ్ళి తలుపు తీసింది. కాని కూతుర్ని చూస్తూనే తనని తాను మరచిపోయింది.

"ఏంటే? ఇప్పుడా రావడం? ఆడపిల్లవేనా? అర్ధరాత్రిదాకా ఏ వెధవతో షికార్లు కొడుతున్నావే"

తల్లి ఉరుములేని పిడుగులా మీద పడేసరికి ఒక్కసారిగా నిర్ఘాంతపోయింది అరుణ.

"వైష్ణో నువ్వుండు చెబుతా. అరుణా ఇలారా నీతో మాట్లాడాలి" అన్నాడు మూర్తి.

"మమ్మీకేవయ్యింది డాడ్ అలా వుంది..."

"ఏమీ కాలేదుగాని నువ్వు కూర్చోమందు"

"ఇంకా దాపరికం ఎందుకూ. వాడెవడో జులపాల వాడితో బైక్ మీదెళ్ళటం నా కళ్ళతో నేను చూస్తేనూ" ఆవేశంతో గొంతు చించుకుంది వైష్ణవి.

"వైష్ణో....ప్లీజ్...నేను అడుగుతున్నా కదా..." భార్యతో చెప్పి "అరుణా... ఇంతాలస్యమయ్యిందేం" అని అడిగాడు మూర్తి.

"కొత్తగా అడుగుతున్నారేంటి. నామీద అనుమానమా?" సూటిగా అడిగింది అరుణ.

"ఛ...ఛ...అదేం లేదు. నువ్వెలాంటి దానివో నాకు తెలీదూ... ఈవెనింగ్ ఎవరి బైక్ మీదో వెళ్తూ కన్పించావుట. అతడెవరూ?" అడిగాడు మూర్తి.

తండ్రి ముఖంలోకి చూసింది. వారి భావం అర్థమైంది. ఒక నిశ్చయాని కొచ్చిందాన్లా ఊపిరి పీల్చుకునొదిలి అంది అరుణ "లవ్వర్"

"ఇంతకుముందు నేన్చెప్పలేదూ. ఆ నవ్వులూ ఆ పద్ధతీ చూసినప్పుడే అనుకున్నాను ఇలాంటిదేదో వుండే వుంటుందని. అనుమానించినంతా అయ్యింది. చదువు ఇంకా పూర్తి కాలేదు గాని ప్రేమలు కావలసి వచ్చాయా?" నిలదీసింది వైష్ణవి.

"అయామె మేజర్..." అంది అరుణ.

బిరుసు సమాధానానికి ఖంగుతిన్నారిద్దరూ.

వైష్ణవి ఏదో అనబోతోంటే వారించి అన్నాడు మూర్తి – "అతడి కులం ఏమిటి..."

అరుణ ముఖం అరుణిమదాల్చగా చెప్పింది.

"దళితుడా! ఇంత బతుకూ బతికి ఇంటెనకాల చచ్చినట్టు!" ముక్కు చీదింది తల్లి.

"కులాలనేవి సంకుచిత చిహ్నాలే. కాదనను. కాని వాళ్ళకీ మనకీ పద్ధతుల్లో ప్రవర్తనలో సంస్కారంలో గుర్తింపులో గౌరవింపులో అన్నిటా తేడా వుంటుంది అరుణా. అసలందుకనే ఈ మధ్య..."

"ఒన్ మినిట్ డాడ్. ఈ మధ్య అంటే గుర్తొచ్చింది. మొన్న మా ఫ్రెండ్ వాళ్ళింటికెళ్ళాను. వాళ్ళ డాడీ కన్పించాడు. ఆయనో పార్టీకి లీడర్లే. చైనానీ పాతరష్యానీ ఆకాశానికెత్తేసి అమెరికాని గుక్కతిప్పుకోకుండా తిట్టాడు. అదయ్యాక వాళ్ళిద్దరు అబ్బాయిలూ అమెరికాలో వున్నారని గొప్పగా చెప్పుకొచ్చాడు. నా సంగతి తెలుసుగా ఏదైనా ముఖాన్నే అడిగేస్తాను. ఓ పక్కన అమెరికాని తిడుతూనే మీ పిల్లల్ని అక్కడికెలా

పంపించారని అడిగాను. ముఖానికి ఎరువు రంగు పులుముకుని నా వ్యక్తిగత అభిప్రాయాలని ఇతరులమీద రుద్దను అని లేచిచక్కాపోయాడు."

"నువ్వు మమ్మల్నేం ఇండైరెక్టుగా ఎత్తి పొడవక్కర్లేదు. మేం కులాంతర వివాహం చేసుకున్నామంటే మా భావాలు వేరు. మా పరిణతి వేరు. పైగా మా ఇద్దరివీ అగ్రకులాలే తెలుసా" అంది వైష్ణవి.

తల్లి ఉక్రోషపు మాటలకి నవ్వింది అరుణ.

"ప్రేమా పెళ్ళీ చిన్నపిల్లల ఆటకాదు అరుణా. సమాజంలో గొప్పగా గౌరవంగా బ్రతకాలంటే మీ పిల్లలూ వాళ్ళ పిల్లలూ సుఖంగా ఎలాంటి సమస్యలూ లేకుండా బ్రతకాలంటే కులం ప్రాధాన్యతనీ ప్రాముఖ్యతనీ త్రోసిరాజన్లేం. మనకిష్టమున్నా లేకపోయినా అగ్రకులపు స్థాయినీ సంస్కారాన్నీ గుర్తింపునీ కాదన్లేం. వదులుకోలేం" నచ్చజెప్పజూశాడు మూర్తి.

"ఒప్పుకుంటున్నాను డాడీ. అందుకునే అభ్యుదయ మంత్రాలు పఠించేవాళ్ళకూడా పిల్లల పెళ్లి దగ్గరకొచ్చేసరికి కులం గుర్తొస్తుంది."

"అదంతా తీరిగ్గా చర్చించుకుందాం గాని ముందు నీ భవిష్యత్తు గురించి మాట్లాడు అరుణా"

"దానికిప్పుడేం ప్రమాదమొచ్చిందీ?" అమాయకంగా అంది అరుణ.

"నీకు రాలేదు మాకొచ్చి పడింది చావు!" రోషపడింది వైష్ణవి.

"నువ్వుండు వైష్ణో. చూడు అరుణా నీ మేలుకోరి నీ సుఖం కోరి మేమోనిర్ణయాని కొచ్చాం. నీకన్నా వయస్సులో అనుభవంలో జ్ఞానంలో అన్నింటా మేం పెద్దవాళ్ళం. ఎంతో ఆచితూచి తీసుకున్న నిర్ణయం ఇది. మమ్మల్నీ మా నిర్ణయాన్నీ గౌరవిస్తావా?"

"అదేంటో తెలీకుండా..."

"చెప్పందే ఒప్పుకోవా?" కోపంగా అంది తల్లి.

"మమ్మీ! నీకివాళేమయ్యింది. ప్రతీదీ కూలంకషంగా సమీక్షించి హేతుబద్ధత గురించి ఆలోచించే నువ్వు నీ కూతురి దగ్గరికొచ్చేసరికి అడ్డంగా వాదిస్తున్నావేంటి?" అడిగింది అరుణ.

తేలుకుట్టిన దొంగలా మిన్నకుండిపోయింది వైష్ణో-తనలో తను కుతకుత ఉడికిపోతూ.

"అమెరికాలో వుంటున్న మా చెల్లెలి కొడుకుతో నీ పెళ్ళి ఖాయం చెయ్యదలిచాం"

తెలిగ్గా నవ్వేసింది అరుణ. "బావుంది డాడీ. తెలుగు సినిమాల్లో క్లైమాక్స్‌కి ముందు అమెరికా వరుడొస్తాడు. అతడికి వ్యక్తిత్వం మన్నూ మశానం ఏం వుండవు. హీరోతో ఎలా తిరిగినా హీరోయిన్ని పెళ్ళిచేసుకోవడానికి రెడీ అయిపోతాడు. అఫ్‌కోర్స్ ఆఖరికి హీరోయిన్ అతడ్ని పెళ్ళి చేసుకోదనుకో. అవునూ... అమెరికాలో అన్నం బదులు డాలర్లు తింటారా డాడ్ అంతా తెగ మోజుపడుతూంటారు."

అవమానంగా ఫీలయ్యాడు మూర్తి "అరుణా! నవ్వులాట కాదు. బీ సీరియస్..."

"నేనూ సీరియస్‌గానే చెప్తున్నాను డాడ్. చెప్పేదానికీ చేసేదానికీ మధ్య అంతరం లేకుండా వుండలేమా? చేసేదే చెప్పలేమా? ఎవర్ని మోసగించడానికి సిద్ధాంతాలూ వేదాంతాలూ వల్లిస్తున్నాం? స్వచ్ఛమైన మనస్సుతో మాట్లాడలేమా? తప్పుడు కబుర్లు గాక మనలోని భావాలనే బైటికి చెప్పలేమా? ఎందుకు మనం మనస్సుకి కూడా ముసుగేసుకోవాలి? ఎవరి కోసం హిపోక్రసీ తోలు కప్పుకోవాలి?

మీరు సైతం మిగతా వాళ్ళలా ప్రవర్తిస్తారని కలలో కూడా అనుకోలేదు డాడ్. వయసు పెరిగేకొద్దీ మీ మనస్సులు కుంచించుకుపోతున్నాయేం? యువతంటే దారీ దిక్కూలేని, తెలీని పిచ్చివాళ్ళ సమూహంలా కన్పిస్తూంటుందా మీకు?..." అరుణ వాక్ప్రవాహానికి షాక్ తిన్నారిద్దరూ.

"అదికాదు అరుణా. అసలేం జరిగిందంటే...."

"ఏమీ జరగలేదు. అయినా ఏదేదో జరిగిందని ఊహించుకుని బెంబేలుపడి మీ కూతురి వ్యక్తిత్వాన్ని కించపరిచేంత, అనుమానించేంత స్థాయికి దిగజారిపోయారు. దటీజ్ టూ బాడ్. కదా మమ్మీ? మీకింకో షాకింగ్ న్యూస్ చెప్పనా?"

ఏమిటన్నట్టు చూశారిద్దరూ రక్తహీన మొహాల్తో.

"మీ ముసుగుల్ని తీసిపారెయ్యాలనే కావాలనే అబద్ధమాడాను. అతడు నా లవ్వర్ కాదు. జస్ట్ ఫ్రెండ్. లైఫ్‌లో కుచ్ బననా హై. అప్పుడే ప్రేమా పెళ్ళీ...బై..."

ఆత్మవిశ్వాసంతో అడుగులేస్తూ వెళ్ళిపోయింది అరుణ.

(స్వాతి మాసపత్రిక)
**జూన్ 2003**